క్లుప్తంగా

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: చెంచుపేటకు చెందిన అడుసుమల్లి శివాజీబాబు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి అన్నదాన కేంద్రంలో శనివారం పేదలకు అన్నదానం చేశారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అడుసుమల్లి భారత్‌కుమార్, అనిల్‌కుమార్, నాగమణి, త్రివేణి, గీతాలక్ష్మి, క్షీరాసాయి, సాయిపూజ, తనూజ, భవిష్య, హిమశ్రీ, సమతా ఫ్రెండ్స్ సంస్థ నిర్వాహకులు జీవీ.నారాయణ, శ్రీనివాస్, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



తెనాలిఅర్బన్: విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవాటు చేసుకోవాలని నారాయణ విద్యా సంస్థల డీజీఎం శ్రీనివాసరెడ్డి, ఏజీఎం వెంకటేశ్వరరావులు పేర్కొన్నారు. పట్టణంలోని నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో కిట్స్ కోఆర్డినేటర్ ప్రతిభ, ప్రిన్సిపల్ వెంకట నాగరాజు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజ్ఞాచారికి డాక్టరేట్



తెనాలిరూరల్: తెలుగు భాషకు సుదీర్ఘ కాలంగా తన వంతు సేవ చేస్తూ తనదైన ప్రత్యేకతను కనబరిచిన తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన సాహితీ రత్న నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి గౌరవ డాక్టరేట్ అందుకోనున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌కు చెందిన తెలుగు సంస్కృతి సాహితీ సేవా సంస్థ చైర్మన్ ఏఎంజీ శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీన హైదరాబాద్ చిక్కడ్‌పల్లి త్యాగరాయ గాన సభ వేదికపై కవులకు గౌరవ డాక్టరేట్ ఇవ్వనున్నామని, దీనిలో భాగంగా అంతర్జాతీయ స్థాయిలో కవిగా గుర్తింపు తెచ్చుకున్న పూర్ణ ప్రజ్ఞాచారి సాహితీ సేవకు గుర్తింపుగా 2024 గౌరవ డాక్టరేట్‌కు ఆయనను తమ సంస్థ ఎంపిక చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా పూర్ణ ప్రజ్ఞాచారి విలేకర్లతో మాట్లాడుతూ తన తండ్రి నూతక్కి అబ్రహాం అక్షర వారసత్వాన్ని కొనసాగిస్తూ రచనలు చేస్తున్నానని, ఇన్నాళ్ల తన శ్రమకు ప్రతిఫలంగా ఈ గౌరవ డాక్టరేట్ రావడంపై హర్షం వెలిబుచ్చారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలో వార్డు వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. శనివారం తెనాలి పట్టణంలోని పలు సచివాలయాలకు చెందిన 40 మంది తమ ఉద్యోగానికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను సచివాలయ అడ్మిన్‌లకు అందజేశారు. వలంటీర్లు మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు తమపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధించిందని చెప్పారు. వారి చర్యలకు నిరసనగా రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. పినపాడు-1 సచివాలయ పరిధిలో 4గురు, మారీసుపేట-2 సచివాలయ పరిధిలో ఇద్దరు, పెరుగుమార్కెట్-1 సచివాలయ పరిధిలో 14గురు, భవనం వారి వీధి సచివాలయ పరిధిలో ఒకరు, చెంచుపేట సచివాలయ పరిధిలో 19 మంది వలంటీర్లు రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. రాజీనామాలను ఆమోదించినట్లు కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ఇప్పటి వరకు తెనాలి పట్టణ పరిధిలో 100 మంది వలంటీర్లు ఉద్యోగాలకు రాజీనామా చేసినట్లు చెప్పారు.

సినీ పరిశ్రమ అభ్యున్నతికి చేయూత నివ్వండి

సినీ దర్శకుడు దిలీప్ రాజా



తెనాలిరూరల్: రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధి గురించి అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రస్తావించాలని 'మా -ఏపీ' వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా డిమాండ్ చేశారు. పెదరావూరు స్టూడియోలో శనివారం జరిగిన 'మా - ఏపీ' సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి వినోదపు పన్ను రూపంలో ఆదాయం ఇస్తున్న సినిమా రంగం పట్ల వివక్ష చూపకూడదన్నారు. సినీ పరిశ్రమకు చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణుల ప్రభావం ఓటర్లపై ఉంటుందని రాజకీయ పార్టీలకు తెలియకపోవటం శోచనీయమన్నారు. సినిమా పరిశ్రమ అభివృద్ధిని పట్టించుకోని పార్టీలకు సినిమా వాళ్లని ఓటు అడిగే నైతిక హక్కు లేదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు . ఏ రాజకీయ పార్టీ రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధిని తమ ఎజెండాగా అమలు చేస్తామని ప్రకటిస్తారో అదే పార్టీకి ఓట్లు వేయవలసిందిగా ఏపీకి చెందిన సినిమా కుటుంబాలకు ఆయన మనవి చేశారు. సమావేశంలో 'మా - ఏపీ' కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో ఆంధ్రా ప్యారిస్

- వైఎస్సార్ సీపీ హయాంలో అయిదేళ్లలో శరవేగంగా అభివృద్ధి పనులు
- 244 అభివృద్ధి పనులకు గానూ రూ.27.45 కోట్ల నిధులు కేటాయింపు
- మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే శివకుమార్ చొరవ
- సుందర తెనాలి సాకారం దిశగా అడుగులు



34వ వార్డు లింగారావు వీధిలో అందంగా రూపుదిద్దుకున్న సీసీ రోడ్డు

తెనాలిఅర్బన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో తెనాలి పట్టణం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. పట్టణంలోని పలు అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం వివిధ రకాల నిధులను విడుదల చేసి వాటిని దాదాపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంది. దీంతో తెనాలిలో అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంతో పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెనాలి పట్టణంలో 40 వార్డులు ఉన్నాయి. వాటిలో సుమారు 2.30 లక్షల జనాభా నివసిస్తున్నారు. వీరి ద్వారా మున్సిపాలిటీకి ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, కుళాయి పన్నుల కింద ఏడాదికి రూ.19 కోట్ల నిధులు సమకూరుతున్నాయి. ఇవి కాకుండా 14, 15వ ఆర్థిక సంఘం నిధులు మున్సిపాలిటీకి వచ్చాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కింద పట్టణంలోని ఒక్కో సచివాలయంకు రూ.20 లక్షల చొప్పున నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. వీటితో ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు పట్టణంలోని సీసీరోడ్లు, డ్రైన్‌లు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలను చేపట్టడంతో పాటు ఇతర అభివృద్ధి పనులకు నిధులను వెచ్చించారు.

అసరాగా నిలిచిన 14,15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థల బలోపేతం కోసం ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తుంటుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 14,15వ ఆర్థిక సంఘం నిధులు సక్రమంగా రాష్ట్రానికి వచ్చే విధంగా చూడటంతో పాటు వాటిని సకాలంలో సద్వినియోగం చేసే విధంగా చర్యలు తీసుకుంది. తెనాలి పట్టణంలో 14వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా 39 అభివృద్ధి పనులు చేశారు. వాటి కోసం రూ.6.39 కోట్ల నిధులు వెచ్చించారు. అలాగే 15వ ఆర్థిక సంఘం కింద ఇప్పటి వరకు 77 పనులు చేపట్టారు. వాటి కోసం రూ.12.66 కోట్ల నిధులు వెచ్చించారు. వాటి ద్వారా చేపడుతున్న పనులలో కొన్ని ఇంకా కొనసాగుతూ ఉన్నాయి. మొత్తం మీద 14, 15వ ఆర్థిక సంఘం కింద తెనాలి పట్టణంలో చేపట్టిన 116 అభివృద్ధి పనులకు రూ.19.05 కోట్లు వెచ్చించారు.

గడప గడప నిధులతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం

తెనాలి పట్టణంలోని 37 వార్డులలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో పూర్తి చేశారు. ఆయన వార్డులలోని ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకోవటంతో పాటు స్థానికంగా నెలకొన్న సమస్యలను ఆయా శాఖల అధికారులతో నమోదు చేయించారు. ప్రజలు తెలియజేసిన ప్రధాన సమస్యలైన సీసీ రోడ్లు, కాలువలు, కల్వర్టుల నిర్మాణాల కోసం ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపారు. వారి అనుమతి రావటంతో తెనాలి పట్టణంలో 128 అభివృద్ధి పనులు చేశారు. వీటి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.8.40 కోట్లు మంజూరు చేసి నిధులు విడుదల చేసింది. దీంతో తెనాలి పట్టణంలో దాదాపు సీసీ రోడ్లు, కాల్వలు, కల్వర్టుల సమస్య పరిష్కారం అయినట్లు చెప్పవచ్చు. మొత్తం మీద తెనాలి పట్టణంలో అయిదు సంవత్సరాలలో రూ.27.45 కోట్లతో 244 అభివృద్ధి పనులు జరిగాయనటంలో ఎటువంటి సందేహం లేదు.



22వ వార్డు మజీద్ సమీపంలో నిర్మించిన సిమెంటు కాలువ

సుందర తెనాలి కలను సాకారం చేస్తాం



సుందర తెనాలి కలను సాకారం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. తెనాలి పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవటంతో పాటు ప్రజలు తెలియజేసిన సమస్యలు పరిష్కరిస్తున్నాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సహకారంతో 244 అభివృద్ధి పనులు చేపట్టాం. వాటి కోసం రూ.27.45 కోట్ల నిధులు వెచ్చించాం. పట్టణంలో ప్రధాన సమస్యలైన సీసీ రోడ్లు, కాల్వలు, కల్వర్టుల సమస్యలు దాదాపు పరిష్కరించాం. రానున్న రోజుల్లో ప్రభుత్వ సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం.

–తాడిబోయిన రాధిక,
మున్సిపల్ చైర్‌పర్సన్, తెనాలి.

26లోగా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

తెనాలిరూరల్: ఎన్నికల విధులకు కేటాయించిన ఉద్యోగులు, సిబ్బంది తమ పోస్టల్ బ్యాలెట్ కోసం 26వ తేదీ సాయంత్రం లోగా దరఖాస్తు చేసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటరులో తమ ఎన్నికల విధుల ఆర్డర్ కాపీ, ఫారం-12, ఓటరు ఐడీ జిరాక్స్‌తో దరఖాస్తు అందజేయాలన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణం 15వ వార్డుకు చెందిన కె.హరికిషోర్ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు ఆయన మృత దేహానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5వేల నగదును అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.ప్రభాకర్, వెంకట్రావు, కొండలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు వార్డులలో రోడ్ షో

తెనాలిఅర్బన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు తెనాలి పట్టణ పరిధిలోని 3, 4, 5, 6, 38 వార్డుల్లో రోడ్ షో నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. రోడ్ షోలో ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అభిమాన నేతలకు ఆత్మీయ స్వాగతం

- రూరల్ మండలంలో జైత్రయాత్రను తలపించిన వైఎస్సార్ సీపీ రోడ్‌షో
- ఎమ్మెల్యే శివకుమార్‌తో కలిసి పాల్గొన్న ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య
- గ్రామాల్లో హారతులు పట్టిన మహిళలు



ప్రచార వాహనంపై అభివాదం చేస్తున్న కిలారి వెంకట రోశయ్య, శివకుమార్

తెనాలి: వైఎస్సార్ సీపీ రోడ్‌షో రూరల్ మండలంలో జైత్రయాత్రలా సాగింది. గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేపట్టిన రోడ్‌షోకు జనం నుంచి విశేష స్పందన లభించింది. శనివారం సాయంత్రం మండల గ్రామం జాకీర్ హుస్సేన్ నగర్‌లో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, రోడ్‌షోను ఆరంభించారు. ప్రచార వాహనంపై ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కిలారి వెంకటరోశయ్య, అన్నాబత్తుని శివకుమార్‌లు ప్రజలకు అభివాదం చేస్తూ బయలుదేరగా, రోడ్‌షో ఆద్యంతం పార్టీ నాయకులు, మహిళలు, వందలాది మంది కార్యకర్తలు పార్టీ జెండాలతో కదంతొక్కారు. తీన్‌మార్ డప్పులు, బాణాసంచా పేలుళ్ల హోరెత్తాయి. హాఫ్‌పేటలో రోడ్‌షోలో అక్కడి అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. రోడ్‌షో తదుపరి ఖాజీపేటకు చేరుకుంది. అక్కడ్నుంచి బాపయ్యపేటకు చేరుకున్నాక శ్రీ ప్రసన్నాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత కొలకలూరు గ్రామానికి రోడ్‌షో చేరుకుంది. మేజరు పంచాయతీ అయిన కొలకలూరు గ్రామంలో మొండిబండ సంఘీయులు పార్టీ గ్రామ అధ్యక్షుడు ప్రసాదం సురేష్ కుమార్ నేతృత్వంలో స్వాగతం పలికారు. సంప్రదాయ వేషధారణలో ఉన్న చెంచులు పూల మాలలతో అభ్యర్థులను సత్కరించారు. మార్గ మధ్యంలో గ్రామ మాజీ సర్పంచ్ ప్రసాదం భాస్కరరావు విగ్రహానికి అభ్యర్థులు పూల మాలలు సమర్పించారు. తదుపరి గ్రామంలోని యాదవుల బజారులో శ్రీకృష్ణ మందిరంకు చేరుకుని కృష్ణ పరమాత్మను దర్శించుకున్నారు. ప్రతి వీధిలోనూ చిన్న పిల్లల్నుంచి పండు వయస్కుల వరకు జెండాలు ఊపుతూ అభ్యర్థులకు స్వాగతం పలకటం విశేషం! పలుచోట్ల మహిళలు గుమ్మడికాయతో హారతులిచ్చారు. శాలువాలతో సత్కరించారు. తెనాలి జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమా ప్రణతి, ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, వైస్ ఎంపీపీ కోడూరి స్వప్న, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ అభ్యర్థులతో పాటు ప్రచారం వాహనంపై ఉండగా రోడ్‌షో యాత్రలో పార్టీ పరిశీలకుడు మండపాటి శేషగిరిరావు, ఆయా గ్రామాల స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు ఇసుకపల్లి సుందరరావు, తలమాల యర్రయ్య, కాలిశెట్టి ఫణికుమార్, గోవతోటి సుధాకర్, కంచర్ల అబ్రహాం, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, చక్కా సీతమ్మ, పినపాటి అనిల్, ఉన్నం లక్ష్మయ్య, గంపల పెద్దబ్బాయి, సంకురు బుజ్జిబాబు, తెనాలి మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, పేరం సంజీవరెడ్డి, గొర్రెపాటి వేణుగోపాల్‌రెడ్డి, మల్లెబోయిన రాము, బొమ్ము నాగిరెడ్డి, కుర్రా జస్వంత్, కాళిదాసు వెంకటేశ్వరరావు, కుక్కల ముక్తేశ్వరరావు, జంగా శివనాగిరెడ్డి, బొనిగల ఉడుముల మహేష్‌రెడ్డి, సురేష్, పిల్లి అరుణ్‌బాబు, అల్లపు బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



సంప్రదాయ వేషధారణలో అభ్యర్థులను సత్కరించిన చెంచులు

జగనన్న పాలనలో ముస్లింల సంక్షేమానికి ప్రాధాన్యం

వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి శివకుమార్ సతీమణి పుష్ప, చైర్‌పర్సన్ రాధిక



18వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పుష్ప, చైర్‌పర్సన్ రాధిక, ప్రజా ప్రతినిధులు

తెనాలిఅర్బన్: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని వైఎస్సార్ సీపీ తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికలు పేర్కొన్నారు. పట్టణంలోని 18వ వార్డులోని మసీదు నుంచి శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేసే కరపత్రాలు పంపిణీ చేశారు. మే 13న జరిగే ఎన్నికలలో అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ మాట్లాడుతూ తెనాలి పట్టణంలో ముస్లిం మైనార్టీలకు మున్సిపల్ చైర్మన్ పదవిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిందని గుర్తు చేశారు. తనను చైర్‌పర్సన్‌గా చేసిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు షేక్ గౌస్యా, నాయకులు షేక్ అన్సారీ, టోపీ సుభాని, కఠారి హరీష్, చెరుకూరి సురేష్ రెడ్డి, కావేటి ఈశ్వర్, పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

డాక్టర్ మోహన్‌దాస్‌కు ఘన నివాళి



డాక్టర్ హరితకు బంగారు పతకాన్ని ప్రదానం చేస్తున్న వైద్యులు

తెనాలిరూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెనాలి శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కొడాలి మోహన్‌దాస్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బోసురోడ్డులోని ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొని డాక్టర్ మోహన్‌దాస్ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో విజయవాడకు చెందిన ప్రశాంత్ హాస్పటల్ స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ పి.హరిత స్త్రీల గర్భకోశ వ్యాధులపై డాక్టర్ కొడాలి మోహన్‌దాస్ సంస్మరణ సభలో స్మారకోపన్యాసం చేశారు. డాక్టర్ హరితకు ఐఎంఏ సభ్యులు డాక్టర్ మోహన్‌దాస్ గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేశారు. డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ కె.పావని ప్రియాంక, డాక్టర్ మాదల ప్రభాకర్‌బాబు, డాక్టర్ పి.దక్షిణామూర్తి, డాక్టర్ మస్తానమ్మ, డాక్టర్ అబ్బయ్య, డాక్టర్ జాస్తి భానుప్రసాద్, డాక్టర్ నరసింహారావు తదితర వైద్యులు పాల్గొన్నారు.

నేడు 'గో టు హెల్' సాంఘిక నాటకం ప్రదర్శన



కరపత్రాన్ని ఆవిష్కరించిన డాక్టర్ సాయిమాధవ్ బుర్రా

తెనాలి: కళల కాణాచి-తెనాలి, వేద గంగోత్రి ఫౌండేషన్-విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో 'గో టు హెల్' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించనున్నారు. రసఝురి-పొన్నూరు సమాజంచే ప్రదర్శించే ఈ నాటకాన్ని స్వర్గీయ గొల్లపూడి మారుతీరావు రచించారు. రంగస్థల/సినీ నటుడు వై.ఎస్.కృష్ణేశ్వరరావు దర్శకత్వం వహిస్తారు. కార్యక్రమ కరపత్రాన్ని శనివారం గాంధీనగర్‌లో ప్రముఖ సినీ మాటల రచయిత, కళల కాణాచి అధ్యక్షుడు డాక్టర్ సాయిమాధవ్ బుర్రా ఆవిష్కరించి, వివరాలను తెలియజేశారు. నాటక ప్రదర్శనకు ముందు ఆరు గంటలకు కళల కాణాచి ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు అధ్యక్షతన జరిగే సభలో పట్టణానికి చెందిన వైద్య ప్రముఖుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తికి 'ప్రైడ్ ఆఫ్ తెనాలి' పురస్కారం ప్రదానం చేస్తారు. అజో-విభో-కందాళం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అప్పాజోస్యుల సత్యనారాయణ పురస్కార ప్రదాతగా వివరించారు. చెరుకుమల్లి సింగారావు, ఎం.రామలింగేశ్వరుడు, కొండముది రమేష్, బడుగు మోహనరావు, దేవరపల్లి భవాని పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్‌ఓలో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

మంగళగిరి: జాతీయ స్థాయిలో నిర్వహించే ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్(ఐఎన్‌టీఎస్‌ఓ) పరీక్షల్లో విజయవాడ జోన్ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబర్చినట్లు జోన్ ఏజీఎం మురళీ కృష్ణ తెలిపారు. శనివారం నగరంలోని తెనాలి రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ విభాగాల్లో మొత్తం 195 మంది విద్యార్థులు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఏజీఎం మురళీకృష్ణ మాట్లాడుతూ తరగతి గదుల్లో చదువుతో పాటు పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, తద్వారా విద్యార్థులు బహుమతులు సాధిస్తున్నారని చెప్పారు. ప్రతి విద్యార్థి మొబైల్ ఫోన్, టీవీలకు దూరంగా ఉంటూ కేవలం చదువులపై మాత్రమే దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.కరుణాకర్, డీన్ వెంకటేశ్వర్లు, కోఆర్డినేటర్ చక్రధర్ ప్రసాద్, ఆర్ఐ రామారావు పాల్గొన్నారు.

నీటి కుంటలతో భూగర్భ జలాల పరిరక్షణ



గుండాలపాడులో ఉపాధి పనుల్లో కూలీలు

ఫిరంగిపురం: మండలంలోని 17 గ్రామాల్లో ఉపాధి హామీ పనులు వేగంగా సాగుతున్నాయి. పొలాల్లో నీటి కుంటల ఏర్పాటు చేయడంతో భూగర్భజలాల వృద్ధి చెంది పంటలకు ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వేసవిలో పశువులకు తాగునీటి కొరత అరికట్టవచ్చని వివరిస్తున్నారు. మండలంలో ఎనిమిది వేలమంది ఉపాధి కూలీలు ఉండగా శనివారం ఐదువేల 802 మంది పనులు చేస్తున్నారు. పంటకాలువల్లో పూడికతీత, చెరువులలో పూడికతీత, పొలాల్లో నీటి కుంటల తవ్వకాలు వంటి పనులు నిర్వహిస్తున్నారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పనులు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. నిర్ణీత సమయం లేకుండా కేటాయించిన పరిధిలో పనిని నిర్వహించినందుకు రోజుకు రూ.300 కూలీగా నిర్ణయించినట్లు చెప్పారు. కూలీలు ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తకుండా అందుబాటులో మెడికల్ కిట్లు ఉంచినట్లు ఉపాధి హామీ పథకం అధికారులు వెల్లడించారు.

రామాలయంలో అన్న సమారాధన



అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కృష్ణవేణి, మాధవి

తెనాలిఅర్బన్: శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా బోసురోడ్డులోని శ్రీ సీతారామ మందిరం వద్ద శనివారం సీతారామ అన్నదాన సేవా సంఘం ఆధ్వర్యంలో అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో పి.కృష్ణవేణి, జీఎం కె.మాధవి, బీజీఎం కె.జయలక్ష్మి, అన్నదాన కమిటీ అధ్యక్షులు దొప్పలపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు. 42 ఏళ్ల నుంచి అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీరు తెలిపారు. కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సుమారు 10 వేల మందికి అన్న సంతర్పణ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో బాలాజీ ప్రసాద్, ఎస్.శ్రీనివాసన్, శేషగిరి, పావులూరి నాగేశ్వరరావు, రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. తెనాలి మండలం నేలపాడు పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్‌ఐ పి. కోటేశ్వరరావు తమ సిబ్బందితో శుక్రవారం రాత్రి పొద్దుపోయాక ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.60,500 నగదు, సెల్‌ఫోన్‌లు స్వాధీనపర్చుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ



మంగళగిరి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గుంటూరు ఆర్‌టీఏ ఆధ్వర్యంలో మంగళగిరి- తాడేపల్లి కార్పొరేషన్ పరిధి కాజ టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం రాత్రి రవాణాశాఖ అధికా రులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. డీటీసీ షేక్ కరీం ఆధ్వర్యంలో ఆర్‌టీఓ గోపాల్ ప్రసాద్, ఎంవీఐలు రాఘవరావు, అనిల్‌కుమార్, మల్లీశ్వరి, సంధ్య కాంటాక్ట్ క్యారేజీ బస్సులు, కంటైనర్ లారీలను ఆపి వాటిలోని సరుకులను తనిఖీ చేశారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఏవైనా సరుకులు రవాణా చేసినట్లయితే కేసులు నమోదు చేయడంతో పాటు సీజ్ చేయడం జరుగుతుందని రవాణా శాఖ అధికారులు బస్సు డ్రైవర్లను హెచ్చరించారు.